## క్లుప్తంగా

### ఘనంగా నర్సుల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సులు

**కొమ్మాది:** నర్సులకు ఆరాధ్య దైవమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ 205వ జయంతిని పురస్కరించుకుని ఎండాడలోని సెయింట్ లూక్స్ నర్సింగ్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మమతా ప్రసాద్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి వైద్య రంగానికి వెన్నెముకవంటిదన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పలువురు నర్సులను సత్కరించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థల కరస్పాండెంట్ ప్రీతమ్ లూక్, వైస్ ప్రిన్సిపాల్ డా. నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ఆక్రమించి ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**తగరపువలస:** ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ సర్వే నంబర్ 100/1, 2, 3, 4లలో 40 అడుగుల రహదారిని ఆనుకుని సన్యాసిరావు, బాబూరావు, అప్పలనాయుడు, రవికుమార్, సంతోష్‌లక్ష్మి తదితరులు ఇళ్లు నిర్మిస్తున్నారని కోరాడ దామోదర్ అనే వ్యక్తి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని దామోదర్ తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి 40 అడుగుల రహదారిలో నిర్మాణాలు చేపట్టడం ద్వారా 30 అడుగులకు కుదించే ప్రయత్నం జరుగుతోందన్నారు. రోడ్డును ఆక్రమిస్తున్న వారిపై విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరినట్టు తెలిపారు.

### మురళీ నాయక్‌కు నివాళి



మురళీ నాయక్ బ్యానర్ వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**పద్మనాభం:** ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన తెలుగు బిడ్డ మురళీ నాయక్‌కు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. పద్మనాభం జంక్షన్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మురళీ నాయక్ బ్యానర్‌కు పూలమాల వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సిరిపురపు వెంకటరావు, పాలూరి కృష్ణారావు, కళగర్ల పేర్రాజు పాల్గొన్నారు.

### త్రిశక్తి ఆలయం వద్ద అన్న సమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

**మధురవాడ:** కొమ్మాది జంక్షన్ త్రిశక్తి (బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గా దండుమారమ్మ) ఆలయ ఉత్సవాలలో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా రెండో రోజు తొలేళ్ల పండగ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పరిసర 14 గ్రామాల ప్రజలు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### నగరంపాలెం సమస్యలపై పీజీఆర్‌ఎస్‌లో వినతి



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో వినతి ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు జ్యోతిష్

**మధురవాడ:** జీవీఎంసీ 5వ వార్డు నగరంపాలెం గ్రామంలో రోడ్లు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు జ్యోతిష్ ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. జ్యోతిష్ మాట్లాడుతూ గ్రామంలో 25-57/2 నుంచి 25-90/సి వరకు వెలగడం లేదన్నారు. రోడ్డు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై స్థానిక అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# పైప్‌లైన్లు సరే.. రోడ్ల సంగతేంటి?



పైపులైన్ నిర్మాణ సమయంలో తొలగించి, సరిచేయని వ్యక్తిగత కుళాయి



చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద తవ్వేసిన సీసీ రోడ్డు



కార్మికవాడలో ఇరుకైన రోడ్డును తవ్వి, వదిలేసిన రాళ్లు

- పైప్‌లైన్ నిర్మాణం పేరుతో తవ్వేసిన రోడ్లు
- పూర్తిస్థాయిలో నిర్మించక వక్రాల అవస్థలు
- అస్తవ్యస్త మార్గంలో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

**తగరపువలస:** జీవీఎంసీ ఒకటో వార్డు పరిధిలో పైపులైన్ల కోసం రోడ్లు తవ్వేసి వదిలేయడంతో, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది ప్రారంభంలో కొండపేట పంప్‌హౌస్ నుంచి తగరపువలస మీదుగా భీమిలిని కలుపుతూ ఒక పైప్ లైన్ నిర్మించారు. గ్లాస్ రీయిన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్ పైపునకు ప్రత్యామ్నాయంగా రూ.1.27 కోట్లతో 350 ఎంఎం డక్ టైల్ ఐరన్ పైప్‌లైన్ రెండుచోట్ల మార్పులు చేపట్టారు. ఇందులో భాగంగా భీమిలి రోడ్డులో కొండపేట నుంచి చిట్టివలస గణేష్ థియేటర్ వరకు ఒక భాగం, భీమిలిలో మరో భాగం ఈ పైప్‌లైన్ నిర్మాణానికి ప్రధాన రహదారిని తవ్వేశారు. పైపులైన్ తరువాత భీమిలిలో గోతులను పూడ్చడానికి సీసీ రోడ్డు వేయగా, తగరపువలస పరిధిలో బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం తగరపువలసలో చాలా వరకు బీటీ రోడ్డు భాగం కుంగిపోయింది. దీంతో అంబేడ్కర్ కూడలి నుంచి గణేష్ థియేటర్ వరకు ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగించేవారు తూలుతూ ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఎవరు, ఎప్పుడు, ఎక్కడ పడిపోతారో తెలియని పరిస్థితి. ఇప్పుడు జీవీఎంసీ వారు కూడా చెప్పలేకపోతున్నారు.

**రెండు వార్డుల ప్రజలకు ఇక్కట్లు**

గత ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నర క్రితం రూ.20 లక్షల గడప గడపకు ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఇటీవల కొండపేట నుంచి గణేష్ థియేటర్ వరకు వేసిన పైపులైన్ కోసం నిలువునా చీల్చేశారు. ఈ మొత్తం పైపులైన్ నిర్మాణం చేపట్టిన మార్గంలో వ్యక్తిగత కుళాయిలు తవ్వి వదిలేశారు. అంతేకాకుండా పైపులైన్ నిర్మాణం కోసం తవ్విన మార్గంలో డెబ్రిస్, రాళ్లు అలాగే వదిలేశారు. ఈ నిర్వాకం కారణంగా ఈ మార్గంలో ప్రస్తుతం ఆటోలు, రేషన్ వాహనాలు తిరగడం మానేశాయి. అత్యవసర వాహనాలైన అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాల పరిస్థితి చెప్పనవసరం లేదు. కాస్తోకూస్తో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు పట్టుకోవడానికి అవకాశం లేకపోవడంతో నీరంతా నేలపాలవుతోంది. దీంతో భీమిలి జోన్ 1,2 వార్డుల పరిధిలో కొండపేట, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ రోడ్డు, అలంకవారి వీధి, కార్మికవాడ, చావుల మదుం రోడ్డు, గణేష్ థియేటర్ రోడ్డు, భీమిలి రోడ్డు ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఎర్రటి దుమ్ము, రాళ్లు, గోతులతో కూడిన ఈ మార్గంలో ద్విచక్రవాహన దారులు ఒడిదుడుకులకు లోనవుతున్నారు. సాధ్యమైనంత త్వరగా రెండు వైపులా నిర్మించిన పైపులైన్ల మార్గంలో మరమ్మతులు చేపట్టి, రహదారులను సరి చేయాలని కోరుతున్నారు.



చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి వద్ద రహదారి దుస్థితి



అలంకవారి వీధిలో ఇరుకు రోడ్డును తవ్వి పూర్తిగా పూడ్చకుండా వదిలేశారిలా..

**రెండో.. 'సారీ'**

ఎగుడు దిగుడుగా ఉన్న ఆ మార్గంతోనే ఏదోలా స్థానికులు సరిపెట్టుకుని వస్తుంటే ఇప్పుడు పాత మార్గంలోనే మరొక పైపులైన్ నిర్మించారు. కొండపేట నుంచి చిట్టివలస జెడ్పీ హైస్కూల్, అలంక వారి వీధి, కార్మికవాడ, చావుల మదుం రోడ్డు మీదుగా భీమిలి రోడ్డును కలుపుతూ నిర్మించిన పైప్‌లైన్ కోసం ఇటీవల గోతులు తవ్వి నెలరోజుల పాటు స్థానికులకు చుక్కలు చూపించారు. ఎలాగోలా పైపులైన్ వేసినా, గోతులు సరిగా పూడ్చని కారణంగా మరోమారు వాహనదారులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలను జీవీఎంసీ ఇబ్బందికి గురి చేస్తోంది.

**దారి పొడవునా గోతులే..**



కొత్తపేట చావుల మదుం రోడ్డు నుంచి కొండపేటలో ఇంటికి చేరుకునే వరకూ గోతులే. దీంతో ద్విచక్ర వాహనంపై రోజూ రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఏడాది క్రితం వేసిన రోడ్డునే తవ్వేశారు. వెంటనే గోతులు తవ్విన మార్గంలో తిరిగి రహదారిని పునరుద్ధరించాలి.

– నేరెళ్ల శ్రీను, కొండపేట

**వర్షం పడితే అంతే..**



గ్రామీణ రహదారుల కంటే దారుణంగా తగరపువలస, చిట్టివలసలో జీవీఎంసీ రహదారులు ఉన్నాయి. నెలల తరబడి పనులు సాగదీయడం వలన ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను అధికారులు గుర్తించాలి. ఇక వర్షం పడిందంటే మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– నందిక రాము, చిట్టివలస

**ఎగుడుదిగుడు రోడ్డును సరిచేయాలి**



కొండపేట నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా భీమిలి రహదారిలో గణేష్ థియేటర్ వరకు నిర్మించిన రహదారి నాసిరకంగా ఉంది. ఎగుడుదిగుడుగా మరమ్మతులు చేపట్టారు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రోడ్డును బాగు చేయాలి.

–బుదుమూరు వాసు, విల్సన్‌పేట

## 90 ఏళ్ల వయసులోనూ సేవలో..

**పెన్షన్ సొమ్ముతో మజ్జిగ పంపిణీ చేస్తున్న వృద్ధురాలు**



మధురవాడ ఉడా కాలనీలో రోడ్డులో మజ్జిగ పంచుతున్న రాజ్యలక్ష్మి

**మధురవాడ:** తొమ్మిది పదుల వయసులోనూ సేవామార్గం వీడలేదు ఆ వృద్ధురాలు. వేసవి వేళ తనకు చేతనైన సాయం చేసేందుకు ముందుకువచ్చారు. ఆమే.. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ స్ప్రింగ్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న జొన్నలగడ్డ రాజ్యలక్ష్మి. మండువేసవిలో పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మజ్జిగలో అల్లం, నిమ్మరసం, కొత్తిమీర వంటివి కలిపి, కొసరి కొసరి మరీ పంచుతున్నారు. ఒక్కోసారి చెరకు రసం కూడా పంపిణీ చేస్తున్నారు. ఆమె భర్త జిల్లా జడ్జిగా రిటైర్ అవడంతో, ఆమెకు వస్తున్న పెన్షన్‌లో కొంత భాగాన్ని ఇలా సేవాకార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. ఆమె పెద్దకోడలు సూర్యప్రభ కూడా ఈ సేవలో పాలుపంచుకుంటున్నారు.

## ప్రతి మత్స్యకారుడు ఒక సైనికుడే..



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ మురళీ కృష్ణ

**కొమ్మాది:** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి మత్స్యకారుడు తీరప్రాంతానికి ఒక సైనికుడని మెరైన్ ఎస్ఐ మురళీ కృష్ణ అన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సోమవారం ఆయన భీమిలి తోట వీధి ప్రాంతంలో మత్స్యకారులతో ఆయన సమావేశమయ్యారు.ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తీర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు కనిపించినా తమకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో రుషికొండ మెరైన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



**• శ్రీకృష్ణతులాభారం**

శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణ తులాభారం నిర్వహించారు. భీమిలి సమీపంలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఒకవైపు శ్రీవారి విగ్రహం, మరోవైపు జీడిపప్పు, కిస్మిస్, బాదం, కొంత నగదు ఉంచి తులాభారం వేశారు. అర్చకులు, ఆలయ ట్రస్టీలు పాల్గొన్నారు. - భీమునిపట్నం

## వైభవంగా తొలేళ్ల సంబరం

**16 గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభం**



పాండ్రంగిలో అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం



పాండ్రంగిలో ఉయ్యాల కంబాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

**పద్మనాభం:** మండల పరిధి మూడు పంచాయతీల్లోని 16 గ్రామాల్లో రెండు రోజులు జరగనున్న గ్రామ దేవతల ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాండ్రంగి పంచాయతీలో ఈ గ్రామంతో పాటు కురపల్లి, బర్లపేట, ఏనుగులపాలెం, మునివానిపాలెం, పాత సామయ్యవలస, కొత్త సామయ్యవలస గ్రామాల్లో జట్లమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా పాండ్రంగిలో అమ్మవారి ప్రతిమలైన ఘటాలను, చెక్క చిత్రీకిరించిన బొమ్మలను ఊరేగించారు. సతకం పట్టు వద్ద ఉయ్యాల కంబాల ఉత్సవం ఉత్సాహంగా నిర్వహించారు.

**బంగారమ్మకు సారె సమర్పణ**

రెడ్డిపల్లి పంచాయతీలోని ఈ గ్రామంతో పాటు రామన్నపేట, భద్రయ్యపేట, సుంకరపేట, రెల్లిపేట, మద్రిబంద, గంగయ్యగారి కల్లాలు, శేరిఖండం పంచాయతీలో ఈ గ్రామంతో పాటు సంగుపేటలో బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెడ్డిపల్లి, శేరిఖండం గ్రామాల్లో రక రకాల స్వీట్లతో కూడిన సారెను సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. రెడ్డిపల్లి రామాలయం ప్రాంగణంలో ఉన్న సతకం పట్టు వద్ద సారెను కాసేపు ఉంచి, ఆలయం వద్దకు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ గ్రామాల్లో ఆరేళ్ల తరవాత ఉత్సవాలు నిర్వహించడంతో ఇళ్లన్నీ బంధు మిత్రులతో కళకళలాడాయి.

## న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**భీమునిపట్నం:** విశాఖపట్నం జిల్లాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు న్యాయపరమైన సలహాలు, న్యాయ సహాయం అందించాలనే ఆలోచన ఉన్న ఔత్సాహికుల నుంచి పారా లీగల్ వలంటీర్ (న్యాయ సహాయకులు)గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంఘం, భీమునిపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత పత్రాలు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మరో స్టాంప్ సైజ్ ఫొటోతో పాటు సంబంధిత పత్రాలను భీమిలి కోర్టులో గల మండల న్యాయ సేవాధికార సంఘం కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని, సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం గాని, పారితోషికం గాని ఉండవని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల అనంతరం 25 నుంచి 50 మందిని పారా లీగల్ వలంటీర్లుగా ఏడాది కాలానికి నియమిస్తారని తెలియజేశారు.

## త్రిశక్తి ఆలయ భూమిని కాపాడండి

**కలెక్టర్, ఎమ్మెల్యేలకు మధురవాడ 14 గ్రామాల పెద్దల వినతి**



పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

**మధురవాడ:** విశాఖ రూరల్ మండలం కొమ్మాది జంక్షన్‌లో ఉన్న త్రిశక్తి (బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గా దండుమారమ్మ) ఆలయం వెనుక భాగంలో ఉన్న, ఆలయానికి చెందిన భూమి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీ ప్రతినిధులు అధికారులకు, ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్, డీఆర్వో, విశాఖ రూరల్ మండల తహసీల్దార్లకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 22/4లో ఉన్న ప్రభుత్వ భూమి ఆలయం స్వాధీనంలో ఉందన్నారు. కొందరు వ్యక్తులు కొద్ది రోజుల క్రితం కబ్జాకు ప్రయత్నించగా ఆలయ కమిటీ సభ్యులు అడ్డుకున్నారన్నారు. గతంలోనూ కొందరు ఆక్రమణకు ప్రయత్నించగా 2022లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని చెప్పారు. తాజాగా వానపల్లి అప్పలరాజు, అతని కుటుంబ సభ్యుల పేరుతో ప్రభుత్వ భూమితో పాటు ఆలయానికి చెందిన భూమి కూడా కలిపి సుమారు 10 సెంట్ల వరకు బోర్డులు ఏర్పాటు చేసి, ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆలయ, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. వినతిపత్రాలు అందించిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి కుడితి రామారావు, కోశాధికారి వాండ్రాసి అప్పలరాజు కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

## స్వయంకృషి నగర్ రోడ్డు సమస్య పరిష్కరించండి

**జోన్-2 పీజీఆర్‌ఎస్‌లో సీపీఎం వినతి**



జోన్-1 కార్యాలయంలో వినతిని స్వీకరిస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు



జోన్-2 జెడ్సీ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు ఇస్తున్న సీపీఎం నాయకులు

**మధురవాడ:** జీవీఎంసీ 5వ వార్డు స్వయంకృషి నగర్‌లో ఆక్రమణలో ఉన్న రహదారి స్థలాన్ని స్వాధీనం చేసుకుని, సగంలో ఆగిపోయిన సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. దీనిపై మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, టీకే శారద, బి.సంతోషి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని రోడ్డు నిర్మాణం చేయమని గతంలో ప్రధాన కమిషనర్లు రాజాబాబు, సంపత్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికీ దానిపై పురోగతి లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**పీజీఆర్‌ఎస్‌కు 5 అర్జీలు**

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 5 అర్జీలు అందాయి. అందులో జీవీఎంసీ రెవెన్యూ విభాగానికి చెందినవే అధికంగా ఉండడం విశేషం. హౌస్ ట్యాక్స్ కోసం దరఖాస్తు చేసుకున్నా వేయలేదని ఒకరు, అన్ని ప్లాట్లకు హౌస్ ట్యాక్స్ వేసి.. ఒకదానికి వేయకుండా వదిలేశారని మరొకరు ఫిర్యాదు ఇచ్చారు. అసంపూర్తిగా ట్యాక్స్ వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

**జోన్-1లో రెండు వినతులు**

**భీమునిపట్నం:** భీమిలి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు రెండు వినతులు వచ్చాయి. ఇందులో పరిపాలనా విభాగానికి సంబంధించి ఒక వినతి, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి వచ్చాయి. వీటిని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.

## నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

## జోనల్ ఆఫీసులో మరుగుదొడ్లకు తాళాలు



మధురవాడ జోనల్ ఆఫీసులో తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

**మధురవాడ:** మధురవాడ జోనల్ కార్యాలయంలో మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో, వివిధ పనులపై కార్యాలయానికి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలనపై ఊరంతా అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ అధికారులు జోనల్ కార్యాలయానికి వచ్చేవారికి మాత్రం మరుగుదొడ్ల సదుపాయం కల్పించడం లేదు. 9 వార్డులకు కేంద్రంగా ఉండి, లక్ష మందికి పైగా సేవలు అందిస్తున్న మధురవాడ జోనల్ ఆఫీసులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరుగుదొడ్లకు కింది స్థాయి సిబ్బంది తాళాలు వేశారు. దీంతో కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## నేడు ట్రాఫిక్ మళ్లింపు

**పద్మనాభం:** మండలంలోని రెడ్డిపల్లి బంగారమ్మ ఉత్సవాల సందర్భంగా మంగళవారం ట్రాఫిక్ మళ్లించనున్నట్టు సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. పద్మనాభం నుంచి చిన్నాపురం వైపు వెళ్లే వాహనాలను రేవిడి మీదుగా, చిన్నాపురం నుంచి పద్మనాభం వైపు వచ్చే వాహనాలను చెల్లూరు మీదుగా మళ్లించనున్నట్టు తెలియజేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ ట్రాఫిక్ నిబంధనలు అమలులోకి వస్తాయన్నారు.

**130 మంది బందోబస్తు:** రెడ్డిపల్లి, పాండ్రంగి గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా 130 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు. వీరిలో పది మంది సీఐలు, 120 మంది ఇతర సిబ్బందిని నియమించినట్టు చెప్పారు.

## పూర్ణ దైవజ్ఞానానికి ప్రతీక పౌర్ణమి



తగరపువలసలో ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత భగవద్గీత సభ్యులు

**తగరపువలస:** పౌర్ణమి అనేది పూర్ణ దైవజ్ఞానానికి ప్రతీక అని విజయరాంపురం ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు కె.త్రినాధరావు తెలిపారు. అమావాస్య అజ్ఞానానికి గుర్తు అని, అజ్ఞానం నుంచి వెలుగు వైపు అనగా దైవజ్ఞానం వైపు ప్రయాణించాలని కోరారు. సమితి ఆధ్వర్యంలో సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి తగరపువలసలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానమార్గం, పౌర్ణమి గురించి వివరించారు. త్రినాథరావు మాట్లాడుతూ అమావాస్య తిథి, పౌర్ణమి తిథికి మధ్య అష్టమి తిథి రోజున శ్రీకృష్ణుడు జన్మించి జ్ఞానులు, అజ్ఞానులకు వారధిగా కనిపిస్తున్నాడన్నారు. కనుక కృష్ణుని విశ్వసిస్తే మోక్షం లభిస్తుందన్నారు. ప్రచార కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వి.సురేష్, బి.పైడన్న, కె.సంతోష్‌లక్ష్మి, కె.రాజు, వి.భవాని తదితరులు పాల్గొన్నారు.